క్లుప్తంగా

'చేదోడు'కు 213 మంది అర్హులు

కృష్ణగిరి: జగనన్న చేదోడు పథకానికి సంబంధించి మూడవ విడత కింద మండలంలో 213 మందిని అర్హులుగా గుర్తించినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ పథకం కింద దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సాయం అందించనున్నట్లు తెలిపారు. పాతవి 191 మందికి గాను 188 మంది అన్ని ఆధారాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా ఈ ఏడాది కొత్తగా మరో 25 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీరి ఖాతాలకు నగదు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

దోమల నివారణకు చర్యలు

హొళగుంద: గ్రామంలో దోమల బెడదను నివారించడానికి పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ గత రెండు రోజులుగా ముమ్మరంగా ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల దోమల బెడద తీవ్రం కావడం, వ్యాధులు ప్రబలుతుండడంతో సర్పంచ్ చలవాది రంగమ్మ, వైస్ సర్పంచ్ మీనాక్షి సూచనల మేరకు పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ రాత్రి వీధుల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా హైపో ద్రావణం, ఇతర మందులు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు చెత్తచెదారం, మురుగు నీరు బయట వదలకుండా సహకరించాలని కోరారు.

శరవేగంగా రోడ్డు మరమ్మతులు



రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

మద్దికెర: మద్దికెర- బురుజుల గ్రామాల మధ్య రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు ఛిద్రమై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో రూ. 40 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. త్వరలోనే పనులు పూర్తి చేయనున్నట్లు ఐడీసీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు.

పంచాయతీ కార్మికుడి మృతి

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికుడు నాగన్న (55) ఆదివారం తెల్లవారుజామున డ్యూటీకి వచ్చేందుకు బయలుదేరి గుండెనొప్పికి గురై మృత్యుఒడికి చేరాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించే నాగన్న ఇంటి నుంచి మార్గమధ్యం హరిజనవాడ వాటర్ ట్యాంకు వద్దకు రాగానే అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. గుర్తించిన వారు వెంటనే 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుమారుడు, కుమార్తె సైతం గతంలోనే మరణించగా, పంచాయతీలోనే స్వచ్ఛ భారత్ కింద పనిచేస్తున్న భార్య సుంకులమ్మ, కోడలు, మనుమడు, మనుమరాలు ఉన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ముత్యాల శైలజ దేవరాజ్ దంపతులు, పంచాయతీ అధికార సిబ్బంది, తోటి కార్మికులు మృతదేహానికి నివాళులర్పించారు. తక్షణ సాయం అందించారు.

అభ్యుదయ సాహిత్యాభివృద్ధికి కృషి

పత్తికొండ రూరల్: అభ్యుదయ సాహిత్యాభివృద్ధికి కృషి చేయాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద కోరారు. ఆదివారం స్థానిక శాంతి టాలెంట్ పాఠశాలలో అరసం జిల్లా మహాసభలను నిర్వహించారు. కవులు జి.వెంకటకృష్ణ, హరికిషన్, కొత్తపల్లి సత్యనారాయణ, మాట్లాడుతూ నవతరం ఆధునిక సాహిత్యం వైపు అడుగులు వేయాలన్నారు. కవి సమ్మేళనం నిర్వహించిన అనంతరం కవులకు మొమెంటోలు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ముర్తుజా, కార్యదర్శి జహీర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద



వెల్దుర్తి 2వ వార్డులో దర్శనమిస్తున్న వీధి కుక్కలు

వెల్దుర్తి: పట్టణంలో ఏ వీధి చూసినా గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్న వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వీటి బెడద తీవ్రమై ప్రజలు బయట తిరగాలంటేనే భయపడుతున్నారు. ప్రతిరోజు పట్టణంలో ఏదో ఓ చోట ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు వీధి కుక్కల బారిన పడుతూనే ఉన్నారు. ఆసుపత్రుల పాలవుతున్నారు. రేబిస్ వ్యాధినబడ్డ కుక్కలు సైతం అక్కడక్కడా అప్పుడప్పుడు పిచ్చిపట్టిన వాటిలా వీధివాసులపై తెగబడుతున్నాయి. ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. పట్టణంలో వీధి కుక్కల బెడద తీరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెల్దుర్తిలో నేడు విద్యుత్ కోతలు

వెల్దుర్తి: పట్టణంతోపాటు చెరుకులపాడు, అల్లుగుండు ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

ఆలూరు సీహెచ్‌సీకి మహర్దశ

- 30 పడకల వార్డు, ఎక్సరే, స్కానింగ్ అత్యవసర గదుల నిర్మాణం
- రూ.1.75 కోట్ల నాబార్డ్ నిధులతో నూతన భవనం ఏర్పాటు
- 90 శాతం పూర్తయిన నిర్మాణ పనులు
- అత్యాధునిక వసతులతో మారనున్న ఆస్పత్రి రూపురేఖలు

ఆలూరు రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. ఇప్పటికే అన్ని పీహెచ్‌సీలను ఆధునీకరించి వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి నెలలో రెండు సార్లు 104 వాహనాల ద్వారా గ్రామ సచివాలయాల వద్ద రోగులు, వృద్ధులు, గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి మండలానికి ఒక 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచారు. ప్రతి సీహెచ్‌సీలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ప్రసవం అనంతరం తల్లీబిడ్డకు సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగుల ఇంటి వద్దకే వైద్యారోగ్య సిబ్బంది వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయా కార్యక్రమాలపై రోగులు, గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూతనంగా నిర్మించిన ఆలూరు సీహెచ్‌సీ భవనం

రూ.1.75 కోట్ల నాబార్డ్ నిధులతో సీహెచ్‌సీ అభివృద్ధి

ఆలూరు క్లస్టర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మహర్దశ పట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.75 కోట్ల నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వారి ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మించింది. ఇందులో 30 పడకల వార్డు, ప్రసూతి గదితో పాటు అత్యవసర చికిత్స విభాగం, ల్యాబ్, అల్ట్రా సౌండ్ సిస్టం గది, ఈసీజీ, ఎక్సరే రూం ప్రత్యేక ప్రసూతి గదితో పాటు గాయాలకు చికిత్స చేసేందుకు ప్రత్యేక గదులను అత్యాధునికంగా నిర్మించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 30 పడకల వార్డు మాత్రమే ఉంది. ఒక ప్రసూతి గది, పోస్టుమార్టం రూంలు అందుబాటులో ఉన్నాయి. మరో రెండు నెలల్లో నిర్మాణాలు పూర్తి కానున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

రోగుల ఇబ్బందులకు విముక్తి

ఆలూరు క్లస్టర్ హెల్త్ సెంటర్ పరిధిలోని 4 మండలాలలో 7 ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలోని 98 గ్రామాలకు చెందిన రోగులు క్లస్టర్ కేంద్రానికి వైద్యం కోసం వస్తుంటారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారితో పాటు రోజూ 4 నుంచి 5 మంది మహిళలు ప్రసూతి కోసం వస్తుంటారు. అలాగే వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడిన రోగులు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరుతుంటారు. స్కానింగ్, ఎక్సరే, ఈసీజీ వంటి సౌకర్యాలు లేని కారణంగా రోగులకు ఆదోని, గుంతకల్లు, బళ్లారి, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రులకు మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేస్తుంటారు. ప్రమాదాల బారిన పడిన వారు సకాలంలో చికిత్స అందక ఎంతో మంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అత్యాధునిక వసతులతో గదుల నిర్మాణాలు చేపట్టి సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో రోగుల ఇబ్బందులకు విముక్తి కలగనుంది.



అందుబాటులోకి రానున్న నూతన గదులు

రోగుల ఇబ్బందులు తీరుతాయి



ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం ఎంతో సంతోషదాయకం. ప్రమాదాలు సంభవించినా, ఇబ్బందికరమైన కాన్పుల కోసం ఆదోని, గుంతకల్లు, బళ్లారి ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చేది. ప్రమాదాలు సంభవించినప్పుడు గాయాలైన వారికి ప్రథమ చికిత్స మాత్రమే చేసేవారు. అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆస్పత్రి అందుబాటులోకి రానుండడంతో రోగుల ప్రాణాలు కాపాడుకోవచ్చు. వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– రాజు, ఆలూరు

కార్పొరేట్ స్థాయిలో వసతులు

ప్రైవేటు ఆస్పత్రికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని ఉన్నతాధికారులకు నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించగా ఆమోదించారు. భవన నిర్మాణాలు పూర్తయితే క్లస్టర్ పరిధిలోని రోగులకు ఇబ్బంది ఉండదు. మహిళల కోసం ప్రత్యేకంగా గైనకాలజిస్టు వార్డు ఏర్పాటు చేయిస్తున్నాం. ఆస్పత్రిలో అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో వివిధ రకాల సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆలూరు సీహెచ్‌సీ





మద్దికెరలో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయం, ఎం.అగ్రహారం రైతు భరోసా కేంద్రం

ప్రారంభోత్సవానికి సిద్ధం

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలో ఉద్యోగుల కోసం కార్యాలయ భవనాలు శరవేగంగా సిద్ధమవుతున్నాయి. మండలంలోని మద్దికెరలో సచివాలయం -1, ఎం.అగ్రహారంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. త్వరలోనే వీటిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించేందుకు నేతలు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

హైవే పక్కన దుకాణాల్లో చోరీ

వెల్దుర్తి: పట్టణ పరిధిలోని హైవే-44 పక్కన చెరుకులపాడు క్రాస్‌లో ఉన్న రెండు దుకాణాలలో శనివారం రాత్రి చోరీ జరిగింది. చెరుకులపాడు వైపు వెళ్లే దారి ఎడమవైపు కృష్ణగిరి మండలం గోకులపాడు, తొగర్చేడు యాగంటిపల్లెకు చెందిన పింజరి బాషా, రాజశేఖర్ రేకుల షెడ్డులలో హోటల్, దుకాణం నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున వచ్చి చూడగా దుండగులు దుకాణాల ముందు భాగంలోని షట్టర్ రేకులను కట్ చేసి లోనికి ప్రవేశించి చోరీ చేసినట్లు తెలుసుకున్నారు. ఆయా దుకాణాలలో రూ.7 వేల విలువ గల సిగరెట్ ప్యాకెట్లు, రూ.3 వేల వరకు నగదు చోరికి గురైనట్లు గుర్తించారు. పోలీసులను ఆశ్రయించనున్నట్లు బాధితులు తెలిపారు.



దుకాణ షెట్టర్ రేకు కట్ చేసిన దృశ్యం



నాడు దేవబెట్ట గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి



నేడు దేవబెట్ట గ్రామానికి వెళ్లే రహదారి

సౌకర్యవంతంగా రోడ్డు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామానికి వెళ్లే రహదారికి నాడు – నేడు పథకం కింద మరమ్మతులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఒక కిలోమీటరు వరకు తారు రోడ్డు వేయడంతో రోడ్డు అందంగా తయారైంది. గతంలో రహదారి శిథిలమై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడ్డ గ్రామస్తులు ప్రస్తుతం సుందరంగా రూపుదిద్దుకున్న రహదారిని చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిందితుడిపై కేసు నమోదు చేయాలి

గోనెగండ్ల: చిప్పగిరి మండలంలో పనిచేస్తున్న విద్యుత్ ఏఈ ఉలిగప్పను అసభ్యకరంగా మాట్లాడిన బోయ శ్రీనివాసులుపై కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం గోనెగండ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిప్పగిరి మండలం బందనహల్లి గ్రామంలో బోయ శ్రీనివాసులును కరెంట్ బిల్లు కట్టాలని ఏఈ కోరడంతో అసభ్యకరంగా దూషించాడని తెలిపారు. నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కేవీపీఎస్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపును మరోచోటికి మార్చండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పెద్ద బావి సమీపంలో మద్యం షాపు ఉండడంతో అటుగా వెళ్లేందుకు పాఠశాల, కళాశాల విద్యార్థినులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, షాపును అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని ఏపీ మహిళా సమాఖ్య నాయకులు ఈరమ్మ, ఉరుకుందమ్మ, వెంకటలక్ష్మి కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. షాపును వేరే ప్రాంతానికి మార్చాలని సూచించారు. సమాఖ్య నాయకులు నాగవేణి, జ్యోతి, నాగలక్ష్మి, బిందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య పట్టణ సమితి నాయకురాలు

యథేచ్ఛగా వంక ఆక్రమణ

హొళగుంద: మండల కేంద్రంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న వంక పరిసరాల్లో ఆక్రమ కట్టడాలు పెరిగి పోతున్నాయి. ఉత్సవంలో భాగంగా లంకాదహనం రోజు రాత్రి భక్తులు పల్లకీని మోసుకొని వంకగుండా కొండ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అయితే కొందరు వంక, కొండలో అక్రమ కట్టడాలు కట్టడంతో పాటు తిరిగేందుకు వీలు లేకుండా ముళ్ల కంపలు, చెత్త చెదారం నింపి వేశారు. ఫలితంగా ఉత్సవ నిర్వహణకు తీవ్ర ఇబ్బందిగా మారుతుందని నిర్వాహకులు వాపోతున్నారు. అలాగే వంక పరిసరాలు ఆక్రమణకు గురికావడంతో పాటు అక్రమ కట్టడాలతో కుంచించుకు పోయింది. దీంతో చిన్నపాటి వర్షానికి వరద నీరు ముందుకెళ్లకుండా సమీప కాలనీలోకి వస్తున్నాయి. వంకలో పేరుకుపోయిన పూడికతో పాటు అక్రమ కట్టడాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పత్తికొండ రూరల్: ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం అని ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ కపిలేశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక శారద వృద్ధాశ్రమం ఆవరణలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో బూత్‌కమిటీలు, శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండిమల్లికార్జున, సీనియర్ నాయకులు పూనా మల్లికార్జున, రంగస్వామి, సుధాకర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, అడ్వకేట్ నాగేష్, శంకరయ్యాచారి, గోరంట్ల, కరణం చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి జొన్నగిరిలో 'జీజీఎంపీ'

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో ఈనెల 31 నుంచి మూడు రోజుల పాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

2 నుంచి మహిళా కబడ్డీ పోటీలు

ఆలూరు: దేవనకొండ మండలం గుడిమరాళ్ల దస్తగిరియ్య స్వామి ఉరుసు సందర్భంగా ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 10 గంటలకు గ్రామపెద్దల సహకారంతో అంతర్రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ 50 వేలు, రెండో బహుమతి రూ 40 వేలు, తర్వాతి స్థానాలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందించనున్నట్లు తెలిపారు. బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్, ఆల్ రౌండర్‌లకు 9 తులాల వెండి బహుమతిగా అందిస్తామని ప్రకటించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 1వ తేదీలోగా రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 85550 10315, 99496 33643 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

గోనెగండ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ప్రజలు తమ సమస్యలను స్పందనలో అధికారులకు అర్జీలు ఇవ్వవచ్చన్నారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రతి రోజూ స్పందన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృష్ణగిరిలో..

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ప్రజలు తమ సమస్యలపై స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

రేపటి నుంచి ఉరుసు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్.కూళ్లూరు గ్రామంలో సోమవారం సద్గురు శక్రవలి గురుస్వాముల గంధోత్సవం, మంగళవారం ఉరుసు మహోత్సవం ఉంటుందని మఠాధ్యక్షులు పి.సక్కరప్పస్వాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు అర్ధరాత్రి 2 గంటలకు గంధం, మంగళవారం తెల్లవారుజామున ఉరుసు మహోత్సవం ఉంటుందని చెప్పారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జియారత్ ఉంటుందని తెలిపారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా నేటి నుంచి బుధవారం వరకు భక్తులకు అన్నదానం ఉంటుందని వెల్లడించారు.

టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఎన్నిక

వెల్దుర్తి: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాన్ మేస్త్రి, రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు సయ్యద్ సలీం పాషా, కోటేశ్వరరావు, ఇంతియాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా షాలు, హరి, స్టేట్ కమిటీ మెంబర్‌గా పాండురంగయ్య, ప్రతినిధులుగా రామాంజనేయులు, రవి, గంగాధర్ రెడ్డి ఎన్నికయ్యారు. అంతకుముందు పట్టణంలో మెకానిక్‌లు బైక్ ర్యాలీ నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన నరేంద్ర (30) అనే వ్యక్తి కర్నూల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలి ఆదివారం రాత్రి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన నరేంద్ర (30) ఐదు రోజుల క్రితం అప్పులిచ్చిన వారి వేధింపులు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఇతడు బెట్టింగ్ కోసం అప్పులు చేసినట్లు తెలుస్తోంది. తన భర్తకు అప్పులిచ్చిన గోనెగండ్లకు చెందిన ఖాజ ఉసేని, పట్టణానికి చెందిన ఆర్‌కె.రామకృష్ణ వేధింపుల వల్లనే పురుగు మందు తాగినట్లు భార్య సుజాత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఖాజవుసేని, ఆర్‌కె.రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలి తెలిపారు.

కన్నడ విద్యార్థులను ఆదుకోవాలి

హొళగుంద: ఆంధ్రాలో ఉండి కన్నడ మీడియం చదివిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కన్నడ సంఘం నాయకులు రాజ పంపన్నగౌడ్ తదితరులు సిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్పను కోరారు. ఆదివారం ఆయన కన్నడ సంఘం నాయకులు ఊకూరు కాడప్ప, గాదిలింగ, వీరేశ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో ఉంటున్న కన్నడ విద్యార్థులు ప్రతి ఏటా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యలను కర్ణాటక సీఎం బసవరాజు బొమ్మాయ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, హొళగుంద, బదినేహాళ్, కౌతాళం, ఆలూరు తదితర ప్రాంతాల్లో కన్నడ చదివే విద్యార్థులను కర్ణాటక ప్రభుత్వం గడినాడు కన్నడిగులుగా గుర్తించేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 31న జరిగే హొళగుంద సిద్దేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమానికి ఆయన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు.



సిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్పకు సమస్యలు విన్నవిస్తున్న దృశ్యం

ఘనంగా నందోత్సవం

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన సిద్దేశ్వర స్వామి జాతరను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నందోత్సవం (నంది ఉచ్చాయోత్సవం) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉచ్చాయంలో ప్రతిష్టించిన నంది విగ్రహానికి పూజారులు మహామంగళారతి, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్థానిక తేరు బజారులో ఉచ్చాయాన్ని ఎదురు బసవన్న గుడి వరకు లాగారు. జాతరలో భాగంగా రథోత్సవానికి ముందు రెండు రోజులు చెడు (నంది) ఉచ్చాయం, మంచి (గజ) ఉచ్చాయం పేరిట ఉచ్చాయాలు లాగడం ఆనవాయితీగా వస్తోంది. రేపు 31న సిద్దేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజపంపన్న గౌడ్ తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు శివశంకర్ గౌడ్, సిద్దార్థ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తేరు బజారులో ఉచ్చాయాన్ని లాగుతున్న భక్తులు

'బోయలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు'

వెల్దుర్తి: బోయలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఎరుకలి, గిరిజన, దళిత సంఘాల నాయకులు వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. సిద్ధినగట్టు గ్రామంలో అధ్యయనానికి బయలు దేరిన వారికి మార్గమధ్యంలో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ఎరుకలి హక్కుల పోరాట సమితి రాష్ట్ర, జిల్లా జనరల్ సెక్రటరీలు ఎరుకల రాజు, కె మద్దిలేటి, ఏపీ ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌లు డి నవీన్‌కుమార్, హనుమంతు మాదిగ, గిరిజన ఐక్య వేదిగ జిల్లా నాయకుడు ఎస్‌పి రాజునాయక్‌లువినతి పత్రం అందించారు.

హాస్టల్ విద్యార్థుల శ్రమదానం

వెల్దుర్తి: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు ఆదివారం సెలవు రోజు తమ శ్రమదానంతో సమాజ సేవలో పాల్గొన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉస్మాన్, ట్యూటర్, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న ఆధ్వర్యంలో విద్యార్థులు హాస్టల్ సమీపంలోని రైల్వే అండర్‌వే బ్రిడ్జ్‌లో పేరుకుపోయిన చెత్త, బురద మన్ను తొలగించారు. చిన్న వర్షానికే ఈ బ్రిడ్జి కింద బురద, నీటి నిల్వతో పాటు ఎండిన తరువాత మన్ను, చెత్తతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. హాస్టల్ విద్యార్థులు తమ సెలవు దినాన బ్రిడ్జ్ డివైడర్ ఒకవైపు గల మొత్తం చెత్త, మన్ను తొలగించారు. తర్వాతి సెలవు రోజు మొత్తంగా తొలగించే ఆలోచనలో ఉన్నట్లు జెడ్పీటీసీ, వార్డెన్ తెలిపారు.

శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆదివారం కొత్తగా శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘ కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా గుర్రేవల చిన్న వీరన్న శెట్టి, ఉపాధ్యక్షులుగా చిన్ని ప్రకాశం శెట్టి, కార్యదర్శిగా అనంత నటరాజ్, సహాయ కార్యదర్శిగా ప్రతాప్ వెంకటేశులు శెట్టి, కోశాధికారిగా గుర్రేవుల కృష్ణమోహన్‌తో పాటు గౌరవాధ్యక్షులుగా అనంత నాగయ్య, గౌరవ సలహాదారులుగా జయంతి నాగరాజులను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తమ వంతుగా కృషిచేస్తామని పేర్కొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఆలూరు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణకుమార్ సూచించారు. పలు కాలనీలలో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను ఆదివారం జేసీబీ ద్వారా తొలగించారు. అలాగే తెర్నేకల్ నుంచి పుల్లాపురం గ్రామ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. అనంతరం సర్పంచ్ అరుణకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అంటు రోగాల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు క్షేత్రంలో వెలిసిన మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానికులే గాకుండ కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు మెట్టుమెట్టుకు బండారం అంటించి భక్తిని చాటుకున్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

ఫిబ్రవరి 7 నుంచి ఉరుసు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దస్తగిరి స్వామి 267వ ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు అదివారం తెలిపారు. పిబ్రవరి 7న దస్తగిరి స్వామి వంశీకుల ఇంటి నుంచి గుర్రంపై గంధంను మేళతాళాలతో దర్గాకు తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారన్నారు. 8న ఉరుసు సందర్భంగా స్వామి గుర్రం ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులు పూజలు చేసి కానుకలు సమర్పిస్తారు. 9న జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఉరుసు సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.



ములుగుందంలో వెలసిన దస్తగిరి స్వామి దర్గా